క్లుప్తంగా

కన్నుల పండువగా శ్రీ విశ్వేశ్వరస్వామి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేట 2/7 శివాలయంలోని శ్రీగౌరీ విశ్వేశ్వరస్వామి జన్మనక్షత్రం పురస్కరించుకుని గురువారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవమూర్తుల్ని ప్రత్యేకంగా ఆలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కల్యాణంలో ఉభయ దాతలుగా జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, శారద, చుండూరు రామ్మోహనరావు, నాగలక్ష్మి దంపతులు వ్యవహరించారు. పూజల్ని జంధ్యాల పవన్ కుమార్ శర్మ, మల్లికార్జున శర్మ , చక్రపాణి పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల్ని పంపిణీ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పట్నంబజారు: గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో మృతి చెందిన సంఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. లాలాపేట సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేట పరిధిలోని ఏడుగొందుల సమీపంలో నిత్యం సంచరించే యాచకుడు మురుగు కాలువలో పడి గురువారం మృతి చెందాడు. అయితే అతడు మద్యం మత్తులో పడి మృతి చెందాడా.. లేక శానిటైజర్ తాగాడా ? అనేది పోస్టుమార్టంలో తెలియాల్సి ఉందని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నగరంపాలెంలో నివసించే 37 సంవత్సరాల మార్కండేయులు బుధవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సోదరుడు ఉదయ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27 నుంచి భావనారాయణ స్వామి ఆలయంలో కుంభాభిషేకం

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీ సాక్షి భావనారాయణ స్వామి దేవస్థానంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న కుంభాభిషేకంలో భక్తులు విశేషంగా పాల్గొనాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కోరారు. ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు రఘునాథచార్యులు మాట్లాడుతూ 27వ తేదీ నుంచి మూడు రోజులపాటు స్వామివారికి విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఈవోలు టి. శ్రీనివాస్, ఆర్. రమణమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఆలయ మాజీ చైర్మన్ నాగసూరి ప్రతాప్ కుమార్, వివిధ ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం

గుంటూరు రూరల్: విశాఖపట్నం అక్కయ్యపాలెం ప్రధాన కార్యాలయంగా ఉన్న కనకమహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంక్ 28వ బ్రాంచ్‌ను గుంటూరులోని ఇన్నర్ రింగ్ రోడ్డులో శనివారం ప్రారంభించనున్నట్లు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ రజతోత్సవాలలో భాగంగా నూతన శాఖను ప్రారంభించటం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. బ్యాంక్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఏపీ చాంబర్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు లంకా రఘురామిరెడ్డి, జాయింట్ రిజిస్ట్రార్ జిల్లా కో–ఆపరేటివ్ అధికారి ఎం.వీరాచారి, కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాసరావు, ఏలూరి కో– ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ వై. గురవయ్య, గుంటూరు ఉమెన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్‌పర్సన్ కె.వి. సుజాత, ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సామినేని కోటేశ్వరరావు, బ్యాంక్ డైరెక్టర్లు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు తోట్లపాలెంలో ఇళ్ల ప్రారంభోత్సవం



చేబ్రోలు: మండలంలోని తోట్లపాలెం జగనన్న కాలనీలో ఇళ్లను శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కఠివరపు అశోక్ గురువారం తెలిపారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో పాటు వీఆర్వో ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలో 30 ఇళ్లను నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జరిగే ప్రారంభోత్సవంలో అతిథులుగా ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొననున్నట్లు అశోక్ పేర్కొన్నారు.

మెమోగ్రామ్‌తో రొమ్ము క్యాన్సర్‌కు చెక్

మేడికొండూరుకు చెందిన సావిత్రి రొమ్ములో నొప్పిగా ఉన్నా పట్టించుకోకుండా పొలం పనులు చేసుకుంటూ కాలయాపన చేసింది. నొప్పి తీవ్రంగా ఉండటంతో అత్యవసర స్థితిలో వైద్యుల్ని సంప్రదించింది. రొమ్ములో గడ్డలు ఉన్నాయని, చాలా కాలంగా చికిత్స చేయించుకోకపోవడంతో క్యాన్సర్‌గా మారినట్లు నిర్ధారించి చికిత్స చేశారు. ఎక్కువ మంది సమస్యను సకాలంలో గుర్తించి చికిత్స చేయించకపోవడం వల్లే రొమ్ము క్యాన్సర్ కేసులు ప్రతి ఏడాది పెరిగిపోతున్నాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న వ్యాధి
- నిర్ధారణలో మెమోగ్రామ్ కీలకం

గుంటూరు మెడికల్ : నేడు యవ్వనంలోకి అడుగు పెట్టే 16 ఏళ్ల యువతి మొదలుకొని 60 ఏళ్ల వృద్ధురాళ్ల వరకు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 23లక్షల మంది వ్యాధి బారిన పడుతున్నారు. 6.85లక్షల మంది చనిపోతున్నారు. ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒకరు ఈ వ్యాధికి బలవుతున్నారు. ప్రతి ఎనిమిది మందిలో ఒకరు దీని బారిన పడుతున్నారు.

కారణాలు....

జన్యుపరమైన కారణాలు, వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. అధిక బరువు, ఆల్కహాల్, పొగాకు వినియోగం , 30 ఏళ్ల వరకు గర్భం దాల్చని వారిలో, అసలు దాల్చని వారిలో రావొచ్చు. చిన్న వయస్సులోనే రజస్వల అవ్వడం, ఆలస్యంగా నెలసరి ఆగిన వారికి వచ్చే అవకాశం ఉంది.

జీజీహెచ్‌లో మెమోగ్రామ్ పరీక్షలు చేయించుకున్నవారి వివరాలు	
సంవత్సరం	సంఖ్య
2017	321
2018	123
2019	217
2020	13
2021	35
2022	100
2023	85
(జనవరి నుంచి సెప్టెంబర్)	



జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్

జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు

పేదల పెద్దాసుపత్రిగా పేరుగడించిన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించే మెమోగ్రఫీ వైద్య పరికరం గత ఏడాది నుంచి అందుబాటులో ఉంది. కార్పొరేట్ క్యాన్సర్ వైద్యసేవల్ని పేదలకు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో నాట్కో ట్రస్ట్ రూ. కోటి విలువైన త్రీడీ డిజిటల్ మెమోగ్రఫీ వైద్య పరికరాన్ని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అందుబాటులోకి తెచ్చింది. మెమోగ్రామ్ పరీక్షను చేసినందుకు ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ. 2వేలు వరకు తీసుకుంటున్నారు. జీజీహెచ్‌లో వ్యాధి నిర్ధారణతోపాటు, రొమ్ము క్యాన్సర్ బాధితులకు అవసరమైన ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. రేడియేషన్ థెరపీ, కిమోథెరపీ వైద్య సేవలు సైతం జీజీహెచ్ నాట్కో క్యాన్సర్‌సెంటర్‌లో పూర్తి ఉచితంగా అందిస్తున్నారు.



రొమ్ము క్యాన్సర్ పరీక్ష చేసే మెమోగ్రామ్ మిషన్

లక్షణాలు

- రొమ్ము, చంకల్లో గడ్డలు
- రొమ్ములపై చర్మం ముడతలు పడటం
- గట్టిగా మారడం, గుంటలు పడటం
- నారింజ రంగులోకి మారటం
- చనుమొనలు నొక్కితే సరిగా లోపలికి వెళ్లవు
- రెండు రొమ్ములు కూడా సైజుల్లో తేడాలు
- చనుమొనల నుంచి తెలుపు, పసుపు, ఎరుపు రంగుల్లో స్రావం
- రొమ్ము, ఛాతీపై చర్మం లోపలికి వెళ్లి చొట్టలు పడటం
- చనుమొనలు చుట్టూ చర్మం పొలుసులుగా మారి రాలి పోవడం

ఉచితంగా రొమ్ము క్యాన్సర్ ఆపరేషన్లు



నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 45 మందికి ఉచితంగా రొమ్ము క్యాన్సర్ ఆపరేషన్లు చేశారు. వీరిలో కొంత మందికి ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రాణాంతకం కాకుండానే వ్యాధి నుండి విముక్తి కల్పించాం. నన్నపనేని లోకాదిత్యుడు, సీతారావమ్మ స్మారక నాట్కో సెంటర్‌లో 24 గంటలు ఉచితంగా క్యాన్సర్ వైద్యసేవలను అందిస్తున్నారు.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్

మెమోగ్రామ్‌తో తొలి దశలోనే గుర్తించవచ్చు



తొలి దశలోనే రొమ్ము క్యాన్సర్‌ను మెమోగ్రామ్ పరీక్షతో గుర్తించవచ్చు. రెండు మిల్లీమీటర్ల కన్నా తక్కువ సైజులో రొమ్ములో గడ్డలు ఉన్నా గుర్తించి వెంటనే వైద్యం చేయవచ్చు. తొలి దశలోనే వ్యాధిని గుర్తిస్తే త్వరితగతిన కోలుకోవడంతో పాటు మరణాన్ని తప్పించవచ్చు. మహిళలే స్వయంగా రొమ్ము పరీక్ష చేసుకుని ఏమైనా గడ్డలు ఉన్నట్లు అనిపిస్తే తక్షణమే వైద్యుల్ని సంప్రదించాలి.

– డాక్టర్ చక్కా సుజాత, సీనియర్ రేడియాలజిస్ట్, గుంటూరు

అశ్రద్ధ చేయవద్దు



జన్యుపరమైన లోపాలు, వంశపారంపర్యం, ఇన్‌ఫెక్షన్లు, ఒక్కోసారి ఎలాంటి కారణం లేకుండానే రొమ్ములో గడ్డలు ఏర్పడతాయి. రొమ్ములో ఉండే ప్రతి గడ్డ క్యాన్సర్ కాదు. అయితే ప్రతి గడ్డను కూడా అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించి పరీక్ష చేయించుకోవడం ద్వారా నిర్ధారించుకోవచ్చు. తద్వారా రేడియేషన్, ఆపరేషన్ లాంటివి లేకుండా వైద్యం చేసి కొద్ది రోజుల్లోనే వ్యాధిని తగ్గించవచ్చు. రొమ్ము క్యాన్సర్‌కు నేడు ఆధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ కందుల రామ్, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

పేదల ఆరోగ్యంపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ



వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

పట్నంబజారు: పేదల ఆరోగ్యంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. నియోజకవర్గంలోని 20వ డివిజన్ నల్లచెరువు, 43వ డివిజన్ నగరంపాలెం, 45వ డివిజన్ కొరిటెపాడు, 21వ డివిజన్ కేవీపీ కాలనీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్య వివరాలు నమోదు, అవసరమైన ప్రతి ఒక్కరికీ వైద్యం అందించే దిశగా మహోన్నత కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం సంతోషదాయకమని తెలిపారు. విప్లవాత్మక నిర్ణయాలతో పాటు, పేద ప్రజలకు తానున్నాననే భరోసా కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఆరోగ్యశ్రీ , 108, విలేజ్ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఆయనకే దక్కుతోందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు కాంద్రుగుంట గురవయ్య, యక్కలూరి మారుతి, కోటి లింగారెడ్డి, కొండారెడ్డి, నాగేశ్వరరావు, గనిక ఝాన్సీ, రవీంద్రనాయక్, సోమి కమల్, బాబు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత.. విద్యాభివృద్ధికి చేయూత



తెలగ అభ్యుదయ సంఘం నాయకులతో కలసి వసతి గృహంలో సదుపాయాలను పరిశీలిస్తున్న బజరంగ్ సీఈవో అంబటి మురళీకృష్ణ

- బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ ఆపన్నహస్తం
- కాపు విద్యార్థి వసతి గృహంలో రూ.30లక్షలతో ఫర్నీచర్ ఏర్పాటు

కొరిటెపాడు(గుంటూరు): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఇప్పటికే పలు సేవా కార్యక్రమాల్ని బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పేదలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లను కూడా అందజేస్తున్నారు. ఇప్పుడు విద్యాభివృద్ధికి కూడా చేయూతనందిస్తూ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు.

కాపు వసతి గృహానికి భూరి విరాళం

ఇటీవల తెలగ అభ్యుదయ సంఘం నాయకులు నిర్మాణ దశలో ఉన్న కాపు విద్యార్థుల వసతి గృహ నిర్మాణానికి ఎంతో కొంత విరాళాన్ని అందించి సహకరించాలని అంబటి మురళీకృష్ణను అభ్యర్థించారు. నిర్మాణ దశలో ఉన్న వసతి భవన సముదాయాన్ని ఆయన స్వయంగా పరిశీలించి, నిర్వాహకులు విస్మయపరిచే విధంగా భారీ విరాళాన్ని ప్రకటించారు. ఐదు అంతస్తులలో 300 పడకలుగా నిర్మాణం జరుపుకున్న కాపు విద్యార్థి వసతి గృహానికి రూ.30 లక్షల వ్యయంతో పూర్తి ఫర్నిచర్, అంతర్గత సదుపాయాలను కల్పించారు. భవనానికి నూతన శోభను తీసుకువచ్చారు. ఆయన సహకారంతో రఘుపతి వెంకటరత్నం నాయుడు కాపు విద్యార్థి వసతి భవనం అద్భుతంగా తీర్చిదిద్దబడి ఈ నెల 1న ప్రారంభోత్సవానికి నోచుకుంది.

నేను పడ్డ కష్టాలు మరొకరు పడకూడదు: అంబటి

వసతి గృహాన్ని అంబటి మురళీకృష్ణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను 1979–80 సంవత్సరంలో గుంటూరు నగరం, పిచుకులగుంటలోని కూర్మ వెంకటరెడ్డి నాయుడు కాపు హాస్టల్‌లో ఉన్నానని గుర్తు చేశారు. వ్యక్తి గత మరుగు దొడ్లు, మంచాలు, దుప్పట్లు, అల్మారాలు వంటి కనీస సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డానని చెప్పారు. ఆ అనుభవం నుంచి ప్రేరణ పొంది నేడు కాపు వసతి గృహానికి ఈ సదుపాయాలు అందించినట్లు తెలిపారు.

సామాజిక సాధికార బస్సు యాత్ర రూట్ మ్యాప్ పరిశీలన

ఏర్పాట్లను పరిశీలించిన మేయర్ కావటి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫాతిమా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ కావటి, నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు: నగరంలో ఈ నెల 4న సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లను గురువారం నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా, పార్టీ శ్రేణులు పర్యవేక్షించారు. పొన్నూరు రోడ్డులోని సంగడిగుంట రోడ్డు వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి కాలి నడకన బ్రహ్మానందరెడ్డి స్టేడియం, ఆర్‌కేటీ సెంటర్, బహిరంగ సభ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్‌కు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈస్ట్ ట్రాఫిక్ సీఐ. బి. కోటేశ్వరరావుతో చర్చించారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

సామాజిక సాధికార బస్సు యాత్రను నగర ప్రజలంతా విజయవంతం చేయాలని

జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు కోరారు. మాయాబజారులో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ ఏర్పాట్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో సామాజిక సాధికార బస్సు యాత్ర రూట్ మ్యాప్, బహిరంగ సభ తదితర అంశాల గురించి చర్చించారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ సుభాని, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), రామనబోయిన అజయ్‌యాదవ్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి అభయశ్రీ ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ కొత్తపేట సతీష్, పార్టీ నేతలు గులాం రసూల్, తోట ఆంజనేయులు, మాదాసు కిరణ్, రబ్బాని, కొండిన్య, రెడ్డి కోటేశ్వరరావు, గిరి రాము పాల్గొన్నారు.

జీజీహెచ్ ఐసీయూలో ఏబీజీ పరికరం ప్రారంభం



పరికరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: వెంటిలేటర్‌పై ఉన్న రోగులకు ఏబీజీ పరికరంతో మెరుగైన వైద్యసేవలు అందించవచ్చని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. జీజీహెచ్ అత్యవసర రక్త పరీక్ష కేంద్రంలో నూతన ఏబీజీ (ఆర్టీయల్ బ్లడ్ గ్యాస్ ఎనలైజర్, రక్తంలో ఆక్సిజన్, కార్బన్‌డయాక్సైడ్ లెవల్స్) పరికరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కేంద్రంలో రెండు వైద్య పరికరాల్ని అందుబాటులో ఉంచామని, ఒక్కొక్కటి రూ. 25 లక్షలు ఉంటుందని తెలిపారు. ఏబీజీ పరీక్ష చేయాలంటే ప్రైవేట్ ల్యాబ్‌లో రూ.1100 వసూలు చేస్తున్నారని, జీజీహెచ్‌లో ఉచితంగా చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని పాల్గొన్నారు.

నీటి పన్ను బకాయిలపై శ్రద్ధ పెట్టండి

ఇన్‌చార్జి కమిషనర్ భాస్కర్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమావేశమైన ఇన్‌చార్జి కమిషనర్ భాస్కర్

నెహ్రూనగర్: నీటి పన్ను బకాయిలపై శ్రద్ధ పెట్టాలని ఇన్‌చార్జి కమిషనర్ పి.వి.కె. భాస్కర్ చెప్పారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం నీటి మీటర్ల చార్జీల వసూళ్లపై ఆర్ఓ, ఆర్ఐలు, డీఈఈలు, ఏఈలు, ఎమినిటీ, అడ్మిన్ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి చార్జీల బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకు తగిన విధంగా వార్డ్ సచివాలయాల వారీగా స్పెషల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. నగరంలో నీటి పన్ను సుమారు రూ.55 కోట్ల బకాయిలు ఉండగా, ఇప్పటి వరకు రూ.7 కోట్లు మాత్రమే వసూలు జరిగినట్లు చెప్పారు. మొండి బకాయిదార్ల కుళాయిలు తొలగిస్తూ రెడ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. డీఈఈలు, ఆర్ఓలతో సమన్వయం చేసుకొని బకాయి వసూళ్లు చేయాలని ఆయన సూచించారు. ఆస్తి పన్నుపై కూడా దృష్టి సారించాలని, మార్చి వరకు వేచి చూడకుండా ఈ నెల నుంచే వసూళ్లకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ (ఇన్‌చార్జి) సీహెచ్.శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఆర్ఓలు బాలాజీ బాష, రెహమాన్, సాంబశివరావు పాల్గొన్నారు.

భావ కవితా చక్రవర్తి కృష్ణశాస్త్రి



కృష్ణ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: భావ కవితా చక్రవర్తి దేవులపల్లి కృష్ణశాస్త్రి అని, ఆయన కవిత్వం రసస్ఫోరకమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో గురువారం దేవులపల్లి కృష్ణశాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోతన కవిత్వాన్ని గుర్తు తెచ్చేలా తేట తెలుగులో ఆయన గేయాల్ని రచించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.జయకుమార్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

700 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



లారీని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు, అధికారులు

చేబ్రోలు: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని విజిలెన్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసిన సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో జరిగింది. సివిల్ సప్లయి, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా చుండూరు మండలం నుంచి చేబ్రోలు మీదుగా కాకినాడకు లారీలో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో నిఘా వేశారు. చేబ్రోలులోని విఘ్నేశ్వర సినిమా హాలు వద్ద లారీని నిలుపదల చేసి తనిఖీలు నిర్వహించారు. తెల్ల ప్లాస్టిక్ గోతాలలో ఉన్న 700 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. లారీ డ్రైవర్ ధీరజ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. చుండూరులోని పద్మశ్రీ రైస్ మిల్లు నుంచి 700 బస్తాల రేషన్ బియ్యాన్ని మేడికొండ రవికుమార్ ఉరఫ్ గజనీ లారీలో లోడ్ చేసినట్లు, అతను చెప్పిన వివరాల ప్రకారం గుజరాత్ తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఇచ్చాడు. కానీ రేషన్ బియ్యం కాకినాడ తరలిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఒక్కో బస్తాలో 50 కేజీల చొప్పున 350 క్వింటాళ్ల బియ్యాన్ని, లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ యజమాని, డ్రైవర్, బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్న మేడికొండ రవికుమార్ ఉరఫ్ గజని, చుండూరు పద్మశ్రీ రైస్ మిల్ యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని చేబ్రోలు సీఎస్‌డీటీ భువనేశ్వరిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదేశించినారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరిరావు, డీఎస్‌వో కోమలి పద్మ, తహసీల్దారు కె.వి. గోపాలకృష్ణ, డీటీ భువనేశ్వరి, పోలీసులు పాల్గొన్నారు.

అంకినీడు స్ట్రోక్ సెంటర్‌కు అవార్డు



సిబ్బందితో డాక్టర్ పమిడిముక్కల విజయ

గుంటూరు మెడికల్: లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌కు చెందిన అంకినీడు స్ట్రోక్ సెంటర్‌కు 'బెస్ట్ కాంప్రెహెన్సివ్ స్ట్రోక్ సెంటర్' జాతీయ అవార్డు లభించింది. అక్టోబరు 27న అహ్మదాబాద్‌లో జరిగిన స్ట్రోక్ సదస్సులో గుజరాత్ ఆరోగ్య మంత్రి రుషికేష్ పటేల్ చేతుల మీదుగా హాస్పిటల్స్ డీన్ డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. అన్ని రకాల బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం)లకు ఉత్తమ చికిత్సలు అందిస్తూ, ముఖ్యంగా తీవ్రమైన పక్షవాతాలకు సకాలంలో థ్రోంబెక్టమీ థెరపీ, స్ట్రోక్‌పై శాస్త్రీయ పరిశోధనలు చేస్తున్నందుకు అవార్డు లభించినట్లు సీనియర్ న్యూరాలజిస్ట్, అంకినీడు స్ట్రోక్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పమిడిముక్కల విజయ చెప్పారు. గురువారం గుంటూరు కొత్తపేటలోని లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో అవార్డు అందుకున్న స్ట్రోక్ సెంటర్ వైద్యులు, సిబ్బందిని ఆమె అభినందించారు. తమ సేవలకు గుర్తింపుగా ప్రతి ఏడాది పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అంకినీడు స్ట్రోక్ సెంటర్‌కు రావడం ఆనందంగా ఉందన్నారు. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో స్ట్రోక్ బాధితులకు తమ సెంటర్‌లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. స్ట్రోక్ బాధితులకు చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా న్యూరో క్యాథల్యాబ్ ఉన్నట్లు హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ తెలిపారు. క్యూఏఐ నుండి దేశంలోనే మొట్టమొదటి అడ్వాన్స్‌డ్ స్ట్రోక్ సెంటర్‌గా తమ సెంటర్‌కు గుర్తింపు లభించిందని ఆయన వెల్లడించారు.

ప్రజలకు మెరుగైన సేవలే 'విజిలెన్స్' లక్ష్యం



నగరంపాలెం: ప్రజలకు మెరుగైన సేవలు, సక్రమంగా సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ, ప్రజల ఆస్తుల పరిరక్షణే తమ లక్ష్యమని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వి.వి.కుమార్ తెలిపారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా విజిలెన్స్ ఎస్పీ ఈశ్వరరావు ఆదేశాల మేరకు గురువారం కొరిటపాడు వాకింగ్ ట్రాక్, ఎన్టీఆర్ స్టేడియం, అన్నమయ్య పార్క్, గుజ్జనగుండ్ల వాకర్స్ గ్రౌండ్స్, అమరావతి రోడ్, బస్టాండ్‌లో కరపత్రాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి పన్నుల ఎగవేతను, ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగంకాకుండా నివారించడం తమ కర్తవ్యమని తెలిపారు. అవినీతికి 'నో' చెప్పండి... దేశాభివృద్ధికి అంకితం కావాలని వాకర్స్, పట్టణ ప్రజలు, ప్రయాణికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐలు ఎ.శ్రీహరిరావు, ఎస్.శ్రీనివాసులరెడ్డి, వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.